క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు


సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్ర మైన శ్రీబాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆషాడ మాసం తొలి ఏకాదశిని పురస్కరించుకొని స్వామివారికి పిఠాపురం మహారాజా గోత్రనామాలతో తొలి పూజా, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి వారిని, అమ్మవార్లకు ప్రత్యేక అలం కరణలు చేశారు.

21న లయన్స్ క్లబ్ జిల్లా క్యాబినేట్ సమావేశం

సామర్లకోట: ఈ నెల 21వ తేదీ రాత్రి లయన్స్ క్లబ్ జిల్లా క్యాబినేట్ సమావేశం నిర్వహించనున్నట్టు ఆ క్లబ్ జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్ తెలిపారు. సామర్ల కోట లయన్స్ క్లబ్ ఆవిర్భవించిన తరువాత మొదటి సారిగా సామర్లకోట లయన్స్ క్లబ్‌కు జిల్లా గవర్నర్ పదవి లభించిందన్నారు. దాంతో మొదటి జిల్లా లయన్స్ క్లబ్ క్యాబినేట్ సమావేశం స్థానిక పూర్ణా కల్యాణ మండపంలో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సమావేశానికి స్థానిక లయన్స్ క్లబ్ మొదటి మహిళా సభ్యురాలు మంగాదేవి, మొదటి ఉపగవర్నర్ వి.కోటేశ్వరరావు, రెండో ఉప గవర్నర్ సి.శ్రీనివాసు, జిల్లాలోని కేబినేట్ ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశంలో సామర్లకోట ప్రజలకు ఉపయోగపడే మంచి ప్రాజెక్టును ఎంపిక చేస్తామన్నారు.

సైబర్ నేరాలు అరికట్టాలి



ఎస్సై సురేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న ముప్పన వీర్రాజు

సామర్లకోట: పెద్దాపురం పట్టణ పరిధిలో ఇటీవల కాలంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలను అరికట్టాలని చేనేత సంఘ రాష్ట్ర నాయకుడు ముప్పన వీర్రాజు అన్నారు. బుధవారం సాయంత్రం సైబర్ నేరాలకు సంబంధించి ఆయన పెద్దాపురం ఎస్సై సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. పేస్ బుక్‌లో సైబర్ నేరానికి సంబంధించిన వ్యక్తుల నుంచి బెదింపులు రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వీర్రాజు తెలిపారు.

బాలాత్రిపుర సుందరీదేవికి రేపు శాకంబరి అలంకరణ

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయంవీధిలో ఉన్న బాల త్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శుక్రవారం శాకంబరి అలంకరణలో భక్తులను దర్శమివ్వనున్నారు. అమ్మవారిని వివిధ రకాలు కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో సర్వాంగ సుందరంగా అలంకరించనున్నట్లు ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు బుధవారం విలేకరులకు తెలిపారు. అమ్మవారికి అలంకరణకు అవసరమైన కూరగాయలు, పండ్లు ఇచ్చే భక్తులు ముందురోజు సాయంత్రంలోగా ఇవ్వాలన్నారు.

కొత్త ఎయిర్ పోర్ట్ కరప మండలంలో ఏర్పాటు చేయాలి

కరప: రాష్ట్రంలో కొత్త ఎయిర్ పోర్టులు నిర్మించాలని తలపెట్టిన నేపథ్యంలో ఒకటి కాకినాడ జిల్లా కరప మండలంలో ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుందని రాష్ట్రీయ హిందూ చైతన్య సదస్సు అధ్యక్షుడు పడాల రఘు పేర్కొన్నారు. పెనుగుదురులో బుధవారం జరిగిన హిందూ చైతన్య సదస్సు, బీజేపీ నాయకుల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల మధ్యలో ఏర్పాటు చేయాలనుకునే విమానాశ్రయాన్ని కరప మండలం గురజనాపల్లి, పెనుగుదురు గ్రామాల మధ్యలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ రెండు గ్రామ పంచాయతీల పరిధిలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన సాల్ట్ భూములు 1127 ఎకరాలు ఉన్నాయన్నారు. ఈ భూములు కాకినాడ నగరానికి సమీపంలో ఉన్నందున సరిహద్దు జిల్లాలకు 60 కిలోమీటర్ల దూరంలో ఉంటుందన్నారు. కాకినాడ, కోనసీమ జిల్లాలకు చెందిన కొబ్బరి, చేపలు, రొయ్యలు తదితర ఉత్పత్తులకు అనువుగా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని సంబంధిత శాఖల మంత్రులు, అధికారులతో పాటు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళతామని రఘు తెలిపారు. బుద్దాల సత్యనారాయణ, ముమ్మిడి పెద్దకాపు, కాదా సత్యనారాయణ, ఎం.చంటిబాబు, జి.విశ్వనాధం, ఎ.శ్రీనివాసు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో ఎస్.పెద్దిరెడ్డి సౌజన్యంతో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలని అన్నారు. నిస్వార్థంగా ఎలాంటి సేవ చేసినా భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. రాజా, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పితే.. అంతే..

- ప్రమాదాలకు నిలయంగా ఫ్లైఓవర్ బ్రిడ్జి రెయిలింగ్
- వాహనాలు ఢీ కొనడంతో కూలిన వైనం
- రిబ్బన్లు కట్టి చేతులు దులుపేసుకున్న అధికారులు



సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడలిలో ఎదురెదురుగా కూలిన రెయిలింగ్

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడలి ప్రదేశం ప్రమాదాలకు నిలయంగా మారింది. రాజమహేంద్రవరం నుంచి ఏడీబీ రోడ్డులో సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా వచ్చే వాహనాలు అదుపు తప్పి బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీకొంటున్నాయి. దీంతో భారీ వాహనాలతో చిన్న వాహన చోదకులు ఏ మాత్రం అ జాగ్రత్తగా ఉన్నా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. దీనికి తోడు ప్రతి రోజు వందలాది మంది కాలి నడకన ఫుట్‌పాత్ మీదుగా నడిచి వెళుతూ ఉంటారు. కొంత మంది రెయిలింగ్‌ను పట్టుకొని నడుచుకొంటూ వెళుతూ ఉంటారు. ఇటువంటి సమయంలో కూలిన రెయిలింగ్‌ను గమనించకపోతే సుమారు 20 అడుగుల ఎత్తు నుంచి కింద పడే అవకాశాలు ఉన్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు ఇటీవల ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఉన్న గోతులు పూడ్చిన సమయంలో కూలిన రెయిలింగ్‌ను ఏర్పాటు చేయక పోవడంపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు కూలిన రెయిలింగ్ వద్ద రిబ్బన్లు కట్టి చేతులు దులుపేసుకున్నారు. అదే విధంగా ఇటీవల స్థానిక స్టేషన్ సెంటర్ నుంచి ఏడీబీ రోడ్డులో పెద్దాపురం వెళుతున్న ఒక కారు మోటారుసైకిల్‌ను ఢీకొని అదుపు తప్పి బ్రిడ్జి దిగువ భాగంలో సత్యనారాయణపురం వెళ్లే మార్గంలో రెయిలింగ్‌ను ఢీ కొంది. అక్కడ కూడా ఆర్అండ్‌బీ అధికారులు రిబ్బన్లు ఏర్పాటు చేశారనే విమర్శలు ఉన్నాయి.

అతి వేగమే ప్రమాదానికి కారణం

ఏడీబీ రోడ్డులో రాజమహేంద్రవరం నుంచి వచ్చే వాహనాలు అతి వేగంగా రావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. రాజమహేంద్రవరం నుంచి వచ్చే వాహనాలు సామర్లకోట, కాకినాడ వెళుతూ ఉంటాయి. ముఖ్యకూడలి ప్రదేశంలో మలుపు ఉండడంతో అతివేగంతో వచ్చే వాహనాలు అదుపు తప్పి రెయిలింగ్‌ను ఢీ కొంటున్నాయి. కొన్ని సమయాల్లో రైయిలింగ్‌ను ఢీకొని వాహనాలు కింద పడి కొంత మంది మృతికి కారణం అవుతున్నాయి. ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడలి ప్రదేశంలో స్పీడ్ బేకర్లు ఏర్పాటు చేసి, రేడియం స్టికర్లు వేస్తే కొంత వరకు వాహనాల వేగాన్ని అదుపు చేయడం వచ్చని స్థానికులు చెబుతున్నారు.

వంతెన గోడల్లో పెరుగుతున్న మొక్కలు

ఫ్లైఓవర్ గోడల్లో మొక్కలు పెరిగిపోతున్నా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడంలేదు. మొక్కలను అలానే వదిలేయడం వల్ల అవి పెరిగి గోడలు బీటలు వారుతున్నాయి. వీటివల్ల బ్రిడ్జికి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇంత ప్రమాదం ఉన్నా అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో అర్థం కావడం లేదు.


బ్రిడ్జి దిగువ భాగంలో కూలిన రెయిలింగ్


సామర్లకోట బ్రిడ్జి గోడల్లో పెరిగి పోయిన మొక్కలు

రెయిలింగ్ నిర్మాణం చేయాలి

సామర్లకోట బ్రిడ్జి అన్ని రహదారులకు కూడలిగా ఉంది. ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. భారీ వాహనాల రాకపోకలు ఎక్కువగా జరుగుతుంటాయి. అందువల్ల కూలిపోయిన రెయిలింగ్ వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు వెంటనే రెయిలింగ్ నిర్మాణం పూర్తి చేసి ప్రమాదాలు నివారించాలి. రెయిలింగ్ నిర్మాణం చేసే వరకు కూలిన ప్రదేశంలో రోడ్డు డివైడర్ బోర్డులు ఏర్పాటు చేయాలి. బ్రిడ్జి గోడలలో రావి చెట్లు పెరిగి పోతున్నాయి. దాని కారణంగా బ్రిడ్జి గోడ బలహీన పడే ప్రమాదం ఉంది.

– కాళ్ల లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్ సామర్లకోట

కూలిన రెయిలింగ్‌ను గమనించాం

స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై కూలిన రెయిలింగ్‌ను గుర్తించాం. ఇటీవల బ్రిడ్జిపై ఉన్న గోతులను పూడ్చివేశాం. నిధులు కొరత కారణంగా రెయిలింగ్ నిర్మాణం చేయలేని పరిస్థితి, నిధులు వచ్చిన వెంటనే కూలిన రెయిలింగ్‌ను నిర్మాణం చేస్తాం. బ్రిడ్జి గోడలో మొక్కలు తొలగిస్తాం.

– నరసింగరావు, ఆర్అండ్‌బీ డీఈ, కాకినాడ

బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి


ఉపాధ్యాయిలతో మాట్లాడుతున్న ఆదిలక్ష్మి

సామర్లకోట: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి అన్నారు. బుధవారం పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కులపై అవగాహన కల్పించేందుకు పాఠశాలలను సందర్శించానన్నారు. నవోదయ పాఠశాలలో ఉన్న విద్యార్థుల సమస్యలను అడిగి ఆమె తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలున్నా నిర్భయంగా చెప్పాలని సూచించారు. ఈ మేరకు పిల్లల హక్కులు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మండల విద్యాశాఖాధికారి ప్రభాకర్ శర్మ, నవోదయ విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య, ఉపాధ్యాయులు జగన్మోహన్‌రావు, ఆర్.సత్యనారాయణ, ఎన్‌సీసీ అధికారి ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్

అన్నవరం: కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆలయకు పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా సత్యదేవుని ప్రసాదాన్ని ఏఈఓ కృష్ణారావు అందజేశారు. ఆయన వెంట స్థానిక పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు, ఏఎస్ఐ రాంబాబు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

- కిటకిటలాడిన మసీదులు
- దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు


సామర్లకోట మసీదులో ముస్లింల ప్రార్థనలు

సామర్లకోట: ముస్లింలు బుధవారం భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలను జరుపుకొన్నారు. తెలుగు ప్రాంతాల్లో ఈ పండగను పీర్ల పండగగా చెప్పుకొంటారు. దైవప్రవక్త మహమ్మదు మనవళ్లు హసన్, హుస్సేన్‌ల వీరోచిత ప్రాణ త్యాగాన్ని జ్ఞాపకం చేసుకొంటూ ఉపవాస దీక్షలు చేశారు. పట్టణ పరిధిలోని మసీదుల్లో తెల్లవారు జాము నుంచి ముస్లింలు ప్రార్థనలు చేశారు. పిల్లలు, పెద్దలు, మహిళలు కొత్త బట్టలు ధరించి వేడుకలు జరుపుకొన్నారు. ముస్లింల మత గురువులు ఆయా మసీదులలో ప్రార్థనలు చేశారు. పిఠాపురం రోడ్డులో ఉన్న మసీదులు, పెన్షన్‌లైన్‌లో ఉన్న మసీదులలోను, పోలీసుస్టేషన్ ఎదురుగా కోటమ్మ చెరువు వద్ద ఉన్న దర్గాలోను ముస్లింలు ప్రార్థనలు చేశారు.

హైవేపై మృతుడి బంధువుల నిరసన


కత్తిపూడి-కాకినాడ జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న మృతుడి బంధువులు, ఎమ్మార్పీఎస్ నాయకులు

శంఖవరం: కాకినాడ–కత్తిపూడి జాతీయ రహదారిపై బుధవారం మృతుడి బంధువులు, ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... పిఠాపురం గ్రామానికి చెందిన మోర్త గవరయ్యకు కత్తిపూడిలో భూమి ఉందని పది సంవత్సరాల క్రితమే ఫైనాన్స్ కంపెనీ వాళ్లకి, తరువాత ఇతర పార్టీకి అగ్రిమెంట్ చేసి డబ్బులు తీసుకున్నాడు. అప్పటి నుంచి భూమి తగాదాల్లో ఉంది. ఈ గొడవలతో బెంగ పెట్టుకున్న గవరయ్య (75) బుధవారం మృతి చెందాడు. దీంతో తమకు న్యాయం చేయాలని కోరుతూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ట్రాఫిక్ సంభించడంతో ప్రత్తిపాడు సీఐ శేఖర్‌బాబు, అన్నవరం ఎస్సై ఐ.కిశోర్ సంఘటన స్థలానికి చేరుకుని నిరసనకారులతో మాట్లాడారు. కేసు దర్యాప్తు చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. దీనిపై మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

గ్రామాల విలీనం చేపట్టాలి

కాకినాడ రూరల్: వాలకపూడి గ్రామంతోపాటు పలు గ్రామాలను కాకినాడ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. వాకలపూడిలోని యాదవ కల్యాణ మండపంలో మాజీ సర్పంచు గింజాల శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో పౌర సేవా సంఘం కన్వీనరు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ కాకినాడ రూరల్ మండలంలోని వాకలపూడి, వలసపాకల, రమణయ్యపేట, ఇంద్రపాలెం, తూరంగి తదితర గ్రామాలు నగరపాలక సంస్థలో విలీనం కోసం ప్రజాభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు. 13ఏళ్లుగా కాలయాపన కారణంగా ఆయా గ్రామాలు అభివృద్ధి చెండడం లేదన్నారు.

నేత్రపర్వం.. పాండురంగని కల్యాణం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ప్రత్యేక పూజలు చేసిన పండితులు
- కల్యాణ వేడుకను తిలకించిన భక్తులు


సామర్లకోటలో రుక్మిణీ సమేత పాండురంగ స్వామి కల్యాణం

సామర్లకోట: రుక్మిణీ సమేత పాండురంగ స్వామి కల్యాణం బుధవారం నేత్ర పర్వంగా జరిగింది. స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న పాండురంగ స్వామి ఆలయంలో ప్రతి ఏడాది ఆషాడ మాసం తొలి ఏకాదశి పర్వదినంలో స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుంది. తొలి ఏకాదశి రోజున స్వామివారిని దర్శించుకోవడం ద్వారా మంచి ఫలితాలు లభిస్తాయని భక్తుల నమ్మకం. ఈ మేరకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ధర్మకర్తలు అయోద్యల పద్మ రాజేంద్రకుమార్, రాజేష్ భక్తులకు ఏర్పాట్లు చేశారు. నూతనంగా వివాహం అయిన దంపతులు స్వామివారిని దర్శించుకోవడం ద్వారా సంతానం కలుగుతుందనే నమ్మకం. ఈ మేరకు ఇటీవల వివాహం అయిన దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు 190 ఏళ్ల క్రితం ఆలయ నిర్మాణం కావడంతో ఒకవైపు మార్గం మాత్రమే ఏర్పాటు చేశారు. దాంతో వీఐపీలు కూడా క్యూలో నిలబడి స్వామివారిని దర్శించుకోవాల్సి వస్తోంది. ఆలయం నుంచి కిలోమీటరు పొడవున భక్తులు బారులుతీరారు. ట్రాఫిక్ ఏఎస్సై రత్నం ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అయోద్యుల రాజేష్, కృష్ణవేణి దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. పంచారామ క్షేత్ర అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చంటి వేద మంత్రాల మధ్య కల్యాణం పూర్తి చేశారు. రుక్మిణి సమేత పాండు రంగ స్వామి కల్యాణం తిలకించడం వలన పాపాల తొలగి పోయి సుఖసంతోషాలతో ఉంటారని వేమూరి సోమేశ్వరశర్మ భక్తులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టతను వివరించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, పట్టణ ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో పానకం, చక్రపొంగలి, పులిహోర ప్రసాదాలను అందజేశారు.


స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ప్రణాళికాబద్ధంగా చదివితే సీటు గ్యారంటీ

కరప: నవోదయ, సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలపై అవగాహన కల్పించుకుని, ప్రణాళికా బద్ధంగా చదివితే సీటు గ్యారంటీగా సాధించవచ్చని ఎంఈఓ-2 పి.సత్యనారాయణ పేర్కొన్నారు. అరట్లకట్టలోని మండల ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు, తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో నవోదయ, సైనిక్ స్కూళ్ల గురించి, అక్కడ అందించే విద్య గురించి వివరించారు. ఆయా స్కూళ్లల్లో చదివితే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. పాఠశాల విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ఎంఈఓ తెలిపారు.

డ్రైనేజీలను ఆక్రమిస్తే ఎలా?


నగరంలో డ్రైనేజీపై కట్టడాలను తొలగించాలని ఇంటియజమానితో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటరావు

- తక్షణమే తొలగించండి
- లేదంటే తొలగించి ఆ చార్జీలను వసూలు చేస్తాం
- ఆక్రమణదారులకు కమిషనర్ ఆదేశం

కాకినాడ: డ్రైనేజీలపై సిమెంట్ స్లాబ్‌లు వేసి ఆక్రమిస్తున్న తీరుపై కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అసహనం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మిలిటరీ రోడ్డులోని చీడిలపొర డ్రైన్, డీ-మార్ట్ ప్రాంతంలోని డ్రైనేజీల వద్ద జరుగుతున్న పూడిక తీత పనులను పర్యవేక్షించారు. చీడిలపొర వద్ద ప్రధాన డ్రైనేజీలో గుర్రపుడెక్క పేరుకుపోవడాన్ని గుర్తించి రెండు మూడు రోజుల్లో తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే డీ-మార్ట్ ప్రాంతంలో కొంతమంది డ్రైనేజీలపై సిమెంట్ స్లాబ్‌లు వేయడంపై ఆయన మండిపడ్డారు. చేసిన ఆక్రమణలు, వాటిపై ఏర్పాటు చేసిన సిమెంట్ స్లాబ్‌లను వెంటనే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని స్పష్టం చేశారు. లేనికుంటే నగరపాలక సంస్థ తరఫున తొలగించి, అందుకు అయ్యే చార్జీలు వసూలు చేస్తామని కమిషనర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పూడిక తీత పనుల ప్రగతిని ఆయన పర్యవేక్షించారు.

టాయిలెట్ల పరిశీలన

సర్పవరం జంక్షన్‌లోని టాయిలెట్లను నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు బుధవారం పరిశీలించారు. వీటి నిర్వహణను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రజారోగ్య విభాగాన్ని ఆదేశించారు. ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణలో ఉన్న నమ్మ టాయిలెట్లను ప్రజలు వినియోగించుకునేలా అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పించాలని కమిషనర్ పేర్కొన్నారు. ఆయన వెంట డీసీపీ హరిదాస్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, శానిటరీ సూపర్ రాంబాబు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్తెప్ప నాయుడు, ఇతర సిబ్బంది ఉన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు


తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో నందీశ్వరునికి అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో పిఠాపురం వేణుగోపాలస్వామి

పిఠాపురం: తొలి ఏకాదశి వేడుకలు పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో బుధవారం వైభవంగా జరిగాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వయంభు క్షేత్రంగా విరాజిల్లుతున్న పిఠాపురం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు విజయ జనార్దనాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించి మెక్కులు తీర్చుకున్నారు. పిఠాపురం పంచమాధవ క్షేత్రాల్లో ఒకటైన కుంతీమాధవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో..

గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణా సమేత నాగేశ్వరస్వామివారి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో వేంచేసిన నందీశ్వరస్వామికి భక్తులు పంచామృత సహిత సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. ఏటా ఆషాడ మాసంలో వచ్చే తొలి ఏకాదశి రోజున నందీశ్వర స్వామికి అభిషేకాలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు

సామర్లకోట:. ఆషాడ మాసం తొలి ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులతో ఆలయాలు కిక్కిరిశాయి. పంచరామ క్షేత్రమైన శ్రీబాలత్రిపుర సుందరి సమేత కుమారరామభీమేశ్వరస్వామి ఆలయంలో ఉన్న శ్రీలక్ష్మీ సమేత విష్ణుమూర్తి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు, పూజలు చేశారు. పూజలు అనంతరం పట్టు వస్త్రాలు, పూలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రసాద వితరణ జరిగింది. అదే విధంగా అతిపూరాతన విష్ణు ఆలయమైన శ్రీమాండ్యనారాయణస్వామి ఆలయంలో పూజలు చేశారు. విష్ణు సహస్రనామ పారాయణ, గీతాపారాయణ నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలోను, పాత సామర్లకోటలోని వేణుగోపాల స్వామి ఆలయంలోను, వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలోను ప్రత్యేక పూజలు చేశారు.


అలంకరణలో పంచారామ క్షేత్రంలోని విష్ణుమూర్తి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: తొలి ఏకదశిని పురస్కరించుకుని వాకతిప్ప పద్మశాలి రామాలయం వద్ద బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ అర్చకులు సీతారాములకు అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రోటరీ గోల్డ్ రథసారథిగా శ్రీకాంత్


క్లబ్ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీకాంత్

బోట్‌క్లబ్: స్థానిక రోటరీ హాల్‌లో బుధవారం రోటరీగోల్డెన్ జూబ్లీ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడిగా శిష్టా శ్రీకాంత్, కార్యదర్శిగా దామెర శ్రీకాంత్, కోశాధికారిగా పి.స్వరూప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసిస్టెంట్ గవర్నర్‌గా ధనసాగర్ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా పేపకాయల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా చార్మినార్ వర్మ, ఇంటరాక్టు క్లబ్ చైర్మన్‌గా ఎస్.చిరంజీవిరెడ్డి, ఇంటర్నేషనల్ సర్వీసెస్ చైర్మన్‌గా వాడ్రేవు రవి ఎన్నికయ్యారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీకాంత్ మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో మరెన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.